(PRGI NO: APTEL / 2023 / 88653)
పబ్లిక్ వ్యూ
తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY
విలేకరులు కావలెను
తెలుగు పత్రికారంగంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న పబ్లిక్ వ్యూ తెలుగు దినపత్రికకు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రిపోర్టర్లు కావలెను.
మీ రెజ్యూమ్ కింద వాట్సాప్ నెంబర్ కు పంపండి
9701132982

(PRGI NO: APTEL / 2023 / 88653)

# పబ్లిక్ వ్యూ

తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

సంపుటి : 2 సంచిక : 295 పేజీలు :8 సంపాదకులు : చిరికి లోకేశ్వరరావు ప్రచురణ : అనకాపల్లి శుక్రవారం 10 జూలై 2026 వెల : 5/-రూ॥

VOLUME :2 ISSUE :295 PAGES :8 EDITOR : CHIRIKI LOKESWARA RAO PUBLISHED FROM :ANAKAPALLI FRI 10 JULY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Kakinada,Eluru,Vijayawada,Guntur, Ongole, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur



## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి... ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా

- వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజం
- ఇది తన ఆత్మగౌరవానికి, ప్రకాశ్ రెడ్డి అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్య
- ప్రకాశ్ రెడ్డి సోదరుడిని కటకటాల వెనక్కి పంపే వరకు పోరాటం ఆగదని హెచ్చరిక
- తనపై చేసిన ఆరోపణలను గురువారం లోపు నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి సవాల్
- తోపుదుర్తి కుటుంబ చరిత్రపై, వారి ఆర్థిక లావాదేవీలపై సంచలన ఆరోపణలు

- మిగతా 2లో






## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

### కొరియాలో లోకేశ్ కీలక భేటీలు

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి

- మిగతా 2లో

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశం
- 45 రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భగీరథ్
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయనున్న పోలీసులు



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో అతడికి గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు

- మిగతా 2లో

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- ఫ్లోర్ లీడర్‌గా ముగిసిన సురేశ్ రెడ్డి పదవీకాలం
- ఆ స్థానంలో రవిచంద్రను నియమించిన కేసీఆర్
- కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మున్నూరు కాపు సంఘం

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానం లో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు

- మిగతా 2లో



## హెచ్‌ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!

- హెచ్‌ఐవీ వ్యాక్సిన్ అభివృద్ధిలో కీలక ముందడుగు
- జంతువులపై జరిపిన ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు
- వైరస్‌ను ఎదుర్కొనే శక్తివంతమైన యాంటీబాడీల ఉత్పత్తి
- మనుషులపై క్లినికల్ ట్రయల్స్ దశకు చేరుకున్న పరిశోధనలు

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణలో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వ్యాక్సిన్ దిశగా శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన ఒక కొత్త వ్యాక్సిన్, కోతుల వంటి ప్రైమేట్లపై జరిపిన పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది.

- మిగతా 2లో



## 'ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు'..

### ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

- మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు
- భారత్‌తో బంధం మరింత బలపడిందన్న వ్యాఖ్యలు
- 2023 అహ్మదాబాద్ పర్యటనను గుర్తు చేసిన ఆల్బనీస్
- క్లిష్ట పరిస్థితుల్లో ముందు స్పందించేది భారతీయులేనని కితాబు
- భారతీయుల వల్ల ఆస్ట్రేలియా బలమైన దేశంగా మారిందని వ్యాఖ్య

- మిగతా 2లో





## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

- రైతులు, రైస్ మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సెమినార్
- రెండో ఏడాది 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న మనోహర్
- 95 శాతం చెల్లింపులను 24 గంటల్లో పూర్తి చేశామన్న మంత్రి

పబ్లిక్ వ్యూ డెస్క్:కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి కావడంతో విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలు

- మిగతా 2లో




నంద్యాల జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న క్లిష్టమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలోనే తక్షణ పరిష్కారం చూపారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతుల 2,074 ఎకరాల భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించారు. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలోనే అధికారుల సమక్షంలో మొత్తం ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించి, రైతులకు విముక్తి పత్రాలను అందజేశారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించిన సీఎం, 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

- మిగతా 2లో

### ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత..

## అమల్లోకి కొత్త నిబంధనలు

- కారుణ్య మరణంపై మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలు
- 'లివింగ్ విల్' ద్వారా చికిత్సపై ముందుగానే నిర్ణయం తీసుకునే అవకాశం
- రెండు దశల మెడికల్ బోర్డుల పరిశీలన తర్వాతే అమలుకు అనుమతి



:ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనాధార

- మిగతా 2లో

# 22ఏ సంకెళ్లు తెంచిన చంద్రబాబు ప్రభుత్వం... గుటుపల్లి రైతుల ఆనందం

అక్కడికక్కడే పరిష్కారం

ఈ ఏడాది మార్చి 9న డోన్ పర్యటనలో గుటుపల్లి రైతులు తమ భూములను గత ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని గుర్తుంచుకున్న ముఖ్యమంత్రి, గురువారం బనగానపల్లె పర్యటనలో ఆ రైతులను ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు.

సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్యలు పూర్తయ్యాయని, జిల్లా స్థాయిలో ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందనందున ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదని రిజిస్ట్రార్ చెప్పడంతో, సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులను రిజిస్ట్రార్‌కు అందజేశారు. "త్వరలోనే పూర్తి చేస్తాం" అని అధికారి చెప్పగా, "త్వరలో కాదు, ఇప్పుడే పూర్తి చేయండి" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి, గుటుపల్లికి చెందిన 2,074 ఎకరాలను 22ఏ జాబితా నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదే స్ఫూర్తితో బనగానపల్లె పట్టణానికి చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తప్పించారు.

**రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారంపై దృష్టి**

బేతంచర్ల తరహాలోనే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ వివాదాలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లోని భూ సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపింది. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం సృష్టించిన ఇబ్బందులను తొలగిస్తూ, లక్షలాది ఎకరాలకు విముక్తి కల్పిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో వేలాది మంది రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

## చైనాలో ఘోర అగ్నిప్రమాదం.. షూ ఫ్యాక్టరీలో 28 మంది సజీవ దహనం

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి... ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా

మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేసి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, ఇది తనకు, ప్రకాశ్ రెడ్డికి మధ్య జీవితకాలం జరిగే యుద్ధమని ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని రాజకీయంగా వెంటాడతానని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు. ఈ మేరకు మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎంఎస్ రాజు మాట్లాడుతూ, "లేని ఆరోపణలు చేసి సమాజంలో నా గౌరవానికి భంగం కలిగించిన నిన్ను, నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టను. నీ అక్రమ ఆస్తుల దగ్గర నేనుంటా. నీ రాజకీయ పోరాటాన్ని చూస్తా. ఇది నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి. దున్నపోతు తల నరికే దొమ్మ పొగరున్న కులంలో పుట్టాను ప్రకాశ్.. భయం అనేది నాకు తెలీదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తోపుదుర్తి కుటుంబ చరిత్రపై కూడా రాజు సంచలన ఆరోపణలు చేశారు. "రూ.800 కోసం లారీ డ్రైవర్‌తో తన్నులు తిన్న చరిత్ర మీ సోదరుడిది. చెప్పుల షాపులో కస్టమర్లు వదిలివెళ్లిన పాత చెప్పులు దొంగలించిన చరిత్ర మీ కుటుంబానిది. అద్దె ఇళ్లలో ఉంటూ యజమానులకు అద్దె చెల్లించకుండా వేధించిన చరిత్ర మీది. సిగ్గు లేకుండా నా గురించి మాట్లాడతారా?" అని ప్రశ్నించారు. తన ఆరాధ్య దైవం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల గురించి నీచంగా మాట్లాడిన ప్రకాశ్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డిని కటకటాల వెనక్కి పంపేంత వరకు తన పోరాటం ఆగదని రాజు స్పష్టం చేశారు. "నువ్వు ఎర మాత్రమే, నీ వెనక ఉన్న నీ అన్నే అసలు టార్గెట్" అని హెచ్చరించారు. తాను సామాన్య కుటుంబం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని రాజు గుర్తుచేశారు. "టీడీపీ కార్యకర్తగా, పసుపు సైనికుడిగా ఉండటమే నాకు ఐదో పదవి. ప్రాణం ఉన్నంతవరకు పసుపు జెండా మోస్తా. చంద్రబాబు గారు నన్ను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమిస్తే, దాన్ని ఆదాయ వనరుగా మార్చుకోలేదు. నా గదికి నేనే అద్దె కడతాను, కనీసం లడ్డూ కూడా తీసుకోను. కానీ మీరు టీటీడీని వ్యాపారంగా మార్చుకున్నారు" అని ఆరోపించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి రాజు సవాల్ విసిరారు. "నాకు విల్లా ఎక్కడుంది?

నా పార్టీ ఆఫీసు స్థలం ఎక్కడ? బెంగళూరులో నాకు ఆస్తులు ఎక్కడున్నాయో చూపించు. నీకు గురువారం వరకు సమయం ఇస్తున్నా. ఆరోపణలు నిరూపించు లేదా పరిణామాలకు సిద్ధంగా ఉండు" అని డిమాండ్ చేశారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదని, తన ఆత్మగౌరవ పోరాటమని, తాను ఒక్కడినే పోరాడతానని ఎంఎస్ రాజు తేల్చిచెప్పారు.

## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు.

సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు

ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- మొదటి పేజీ తరువాయి

జారీ చేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా భగీరథ్‌ను హైకోర్టు ఆదేశించింది.

ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఉదంతంలో మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా అతడు జైలులోనే ఉంటున్నాడు. బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిందితుడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువు నష్టపోతున్నాడని కోర్టుకు విన్నవించారు. అయితే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను ద

వ్యతిరేకించారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేశారు. కాగా, తన బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు గతంలో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## 'ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు'..

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు. భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత.. అమల్లోకి కొత్త నిబంధనలు

- మొదటి పేజీ తరువాయి

వ్యవస్థలను ఉపసంహరిం చుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు. ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది. సుప్రీంకోర్టు 2018లో 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్యాసివ్ యూథనేషియాకు అనుమతించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి నెలకొంది.

**మార్గదర్శకాలలోని ముఖ్యాంశాలు**

ఈ కొత్త నిబంధనల ప్రకారం, స్పృహలో ఉన్న ఏ వ్యక్తి అయినా 'అడ్వాన్స్ డైరెక్టివ్' (ముందస్తు వీలునామా) రాసుకోవచ్చు. దీని ద్వారా భవిష్యత్తులో తనకు ఎలాంటి చికిత్స అందించాలో లేదా నిలిపివేయాలో ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు సాక్షుల సమక్షంలో నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ద్వారా ఈ పత్రాన్ని ధృవీకరించుకోవాలి.

ఒకవేళ రోగి పరిస్థితి విషమించి, చికిత్స ఫలించదని భావిస్తే సంబంధిత ఆసుపత్రి ఒక 'ప్రైమరీ మెడికల్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు 48 గంటల్లోగా తన నివేదికను సమర్పిస్తుంది. వారి సిఫార్సుల అనంతరం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) నేతృత్వంలోని 'సెకండరీ మెడికల్ బోర్డు' తుది నిర్ణయం తీసుకుంటుంది. కుటుంబ సభ్యుల అంగీకారం, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించిన తర్వాతే వైద్య సహాయాన్ని నిలిపివేస్తారు. ఈ నిబంధనల అమలును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సహా ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. తాజా మార్గదర్శకాల వల్ల రోగుల కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- మొదటి పేజీ తరువాయి

చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

# సంపాదకీయం

## బీజేపీకి చెక్ పెట్టేందుకే పీకే ప్లాన్

తెరవెనుక ఉంటూ గొప్ప పొలిటికల్ స్ట్రాటజిస్టుగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ పెట్టి పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు తానే స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల గోదాలోకి దూకారు. ఆయన స్థాపించిన జన సూరాజ్ పార్టీ కోర్ కమిటీ నిర్ణయం ప్రకారం.. బీహార్‌లోని అత్యంత హై-ప్రొఫైల్ అసెంబ్లీ స్థానమైన బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై, ఇటీవల రాజ్యసభకు వెళ్లిన సీనియర్ నేత నితిన్ నబీన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి జూలై 30, 2026 న ఉపఎన్నిక జరగనుంది. గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేయడానికి వెనుకడుగు వేసిన పీకే.. ఇప్పుడు ఏకంగా బీజేపీకి కంచుకోట లాంటి స్థానంలో పోటీకి దిగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రశాంత్ కిషోర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయ అనివార్యత దాగి ఉంది. గత 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ అంచనాలతో 238 స్థానాల్లో పోటీ చేసిన జన సూరాజ్ పార్టీ.. ఒక్క సీటులో కూడా గెలవలేక పూర్తిగా చాపచుట్టేసింది. ఈ ఘోర పరాజయం వల్ల పీకే సృష్టించిన పొలిటికల్ హైప్ ఒక్కసారిగా కరిగిపోయింది. పార్టీ ఉనికిని కాపాడుకోవాలన్నా, కేడర్‌లో తిరిగి ఉత్సాహం నింపాలన్నా తానే స్వయంగా యుద్ధరంగంలోకి రావాలని పీకే భావించారు. అందుకే, తదుపరి సార్వత్రిక పోరు దాకా ఆగకుండా, ఈ ఉపఎన్నికను తన రాజకీయ భవితవ్యానికి ఒక యాసిడ్ టెస్ట్ గా మార్చుకున్నారు. 1990ల కాలం నుండి గతంలో పట్నా వెస్ట్ గా ఉన్న ఈ నియోజకవర్గం బీజేపీకి అల్ట్రా-సేఫ్ సీటు. నితిన్ నబీన్ ఇక్కడి నుండి వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పట్నా నగర పరిధిలోని అత్యంత ధనిక, విద్యావంతులైన ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం జెండాను కాదని వేరే పార్టీ గెలవడం దాదాపు అసాధ్యమనే టాక్ ఉందిఅయితే, ఇంతటి కఠినమైన నియోజకవర్గాన్ని పీకే ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్ట్రాటజిస్ట్ మైండ్ దాగి ఉంది. బాంకీపూర్‌లో బీహార్‌లోనే అత్యధికంగా అక్షరాస్యత రేటు ఉంది. ఇక్కడి ఓటర్లు కుల సమీకరణాల కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యార్హతలు చూసి ఓటు వేస్తారనే నమ్మకం పీకేకు ఉంది. బాంకీపూర్ ప్రజలు బీహార్‌లోనే అత్యంత చైతన్యవంతులు.. సరైన ప్రత్యామ్నాయం దొరికితే వారు మార్పు కోరుకుంటారు అని పీకే ఓటర్లను నేరుగా ఆకర్షిస్తున్నారు. పైగా, ఈ ఎన్నికను బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఆర్నెల్ల పాలనపై ఒక రెఫరెండం గా ఆయన అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ ఓడిపోయినా బీజేపీ కోటలో గట్టి ఫైట్ ఇచ్చాం అని చెప్పుకోవచ్చు, పొరపాటున గెలిస్తే మాత్రం బీహార్ రాజకీయాల్లో జన సూరాజ్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందిప్రస్తుత గెలుపు అవకాశాలను అంచనా వేస్తే.. పీకేకు ఇది అత్యంత భారీ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో బీజేపీ ఓటు బ్యాంక్ ఇక్కడ చాలా పటిష్టంగా ఉంది. పీకే రాకతో కాంగ్రెస్ నాయకుడు రిషి మిశ్రా లాంటి వారు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. అధికారిక ప్రతిపక్షమైన ఆర్జేడీ - కాంగ్రెస్ కూటమి మహాగఠ్‌బంధన్ ఇక్కడ సొంత అభ్యర్థిని నిలబెడితే ఓట్లు చీలిపోయి బీజేపీకి మరింత లాభం చేకూరుతుంది. పైగా బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా పెట్టిన జన్శక్తి జనతా దళ్ తరఫున సామాజిక కార్యకర్త వీణా మాన్వి ని బరిలోకి దించడం కమలదళానికి రూట్ క్లియర్ చేస్తోంది. ఆగస్టు 3న వచ్చే ఫలితాల్లో పీకే గనుక ఇక్కడ డిపాజిట్ కోల్పోతే.. కేవలం ఢిల్లీ ఏసీ రూముల్లో కూర్చుని స్క్రిప్టులు రాసే కార్పొరేట్ స్ట్రాటజిస్టే తప్ప, గ్రౌండ్ లెవెల్ లీడర్ కాదంటూ ప్రత్యర్థులు ఆయన్ను రాజకీయంగా సమాధి చేసే ప్రమాదం ఉంది. అలా కాకుండా బీజేపీ మెజారిటీని భారీగా తగ్గించినా, లేదా అద్భుతం జరిగి గెలిచినా.. 2025 పరాభవానికి పీకే సరైన రివెంజ్ తీర్చుకున్నట్లవుతుంది. ఈ చావో రేవో పోరాటంలో పీకే మైండ్ గేమ్ గెలుస్తుందా, లేక కమలం కోట నిలుస్తుందా అనేది బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

## హెచ్‌ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!ద

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యాక్సిన్ ద్వారా అత్యంత శక్తివంతమైన, విస్తృత స్థాయిలో పనిచేసే యాంటీబాడీలు ఉత్పత్తి అయినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఫలితాలు ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వ్యాక్సిన్‌ను లా జొల్లా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇమ్యునాలజీ, స్క్రిప్స్ రీసెర్చ్, మరియు ఇంటర్నేషనల్ ఎయిడ్స్ వ్యాక్సిన్ ఇనిషియేటివ్ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇది నేరుగా వైరస్‌పై దాడి చేసే బదులు, మన రోగనిరోధక వ్యవస్థలోని 'బి' కణాలకు దశలవారీగా శిక్షణ ఇస్తుంది. దీనివల్ల, నిరంతరం రూపాంతరం చెందే హెచ్‌ఐవీలోని అనేక రకాలను గుర్తించి, నిర్వీర్యం చేయగల శక్తివంతమైన యాంటీబాడీలు తయారవుతాయి. హెచ్‌ఐవీ తన రూపాన్ని మార్చుకుంటూ, రక్షణ కవచాలను ఏర్పరచుకోవడం వల్ల ఇప్పటివరకు వ్యాక్సిన్ అభివృద్ధి చేయడం సవాలుగా మారింది. అయితే, ఈ కొత్త విధానం ఆ అడ్డంకులను అధిగమించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జంతువులపై ఇంతటి సానుకూల ఫలితాలు రావడం ఇదే మొదటిసారని వారు పేర్కొన్నారు. ఈ ప్రయోగాల విజయంతో, ఇదే తరహా వ్యూహాలతో మానవులపై క్లినికల్ ట్రయల్స్ కూడా ప్రారంభమయ్యాయి. అయితే, మనుషుల్లో దీని భద్రత, సమర్థతపై పూర్తిస్థాయి డేటా రావడానికి మరికొంత సమయం పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్‌ఐవీని నియంత్రించడానికి సమర్థవంతమైన మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఇన్ఫెక్షన్లను అరికట్టాలంటే వ్యాక్సిన్ కీలకం. ఈ పరిశోధన ఆ దిశగా పడిన ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

- మొదటి పేజీ తరువాయి

తెచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో ఏకంగా 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి రికార్డు సృష్టించిందన్నారు. రూ. 31 వేల కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే పూర్తి చేశామని తెలిపారు. ఏపీ తెచ్చిన '10 శాతం బ్రోకెన్ రైస్' విధానాన్ని కేంద్రం కూడా గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయనుందని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ బుకింగ్, మాయిశ్చర్ మీటర్ల ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెంచామని, రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా రైతులను సన్నద్ధం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# టీడీపీ మాజీ ఎంపీపీ దాడి చిన గోవింద తో పాటు వైసీపీ నుండి టీడీపీ లోకి 50 కుటుంబాలు చేరిక....





**చోడవరం (పబ్లిక్ వ్యూ )జులై 9:** చోడవరం నియోజకవర్గం బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన మాజీ తెలుగుదేశం పార్టీ ఎంపీపీ దాడి చిన గోవింద ఉద్యోగ రీత్యా కొంతకాలం పార్టీకి దూరంగా ఉన్నారు. పదవీ విరమణ అనంతరం తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు , చోడవరం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయనకు పార్టీ కండువా కప్పి ఘన స్వాగతం పలికి పార్టీలోకి ఆహ్వానించారు.

అదే కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గూడెపు ఈశ్వరరావు, సయ్యపురెడ్డి ఈశ్వరరావు, సిరిగిశెట్టి రంగారావు, సయ్యపురెడ్డి నాగ సత్తిబాబుతో పాటు సుమారు 50 కుటుంబాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి లక్ష్యాలు మరియు పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసంతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తుందని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు మాట్లాడుతూ, పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో చోడవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు.

పార్టీలో చేరిన నాయకులు తమకు ఆహ్వానం పలికి గౌరవించిన బత్తుల తాతయ్య బాబు కి, ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, సాయం రాజశేఖర్ (శేషు), దొండా నరేష్, దొండా రమేష్, సయ్యపురెడ్డి మాధవరావు, మంచాల గోవింద, ఇంటి అప్పారావు, అక్కిరెడ్డి కనకరాజు, తలారి శంకర్, గురుమూర్తి, ముత్యాల సూరిబాబు, గండిబోయిన రాము తదితరులు పాల్గొన్నారు.



# ఉంగుటూరులో 100% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ -- 83.70% డిజిటైజేషన్ పూర్తి

✷ జూలై 14లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న సూచన



**ఉంగుటూరు, పబ్లిక్ వ్యూ: జూలై 9:**:ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 2,07,386 మంది ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు ఓటరు నమోదు అధికారి, ఏలూరు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు.

ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 80 శాతం కంటే తక్కువ డిజిటైజేషన్ సాధించిన బూత్ లెవెల్ అధికారులతో (బీఎల్వోలు) ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డిజిటైజేషన్ పురోగతిని వేగవంతం చేయడానికి అవసరమైన సాంకేతిక అవగాహన కల్పించి, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారు.

ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల్లోని మొత్తం 2,07,386 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, వాటిలో 1,73,582 ఫారాల డిజిటైజేషన్ పూర్తై 83.70 శాతం పురోగతి నమోదైందని ఆమె వెల్లడించారు. ఈ ప్రక్రియ జూలై 14 వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియలో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు, ఏలూరు జిల్లాలో 2వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఉంగుటూరు నియోజకవర్గాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

అదేవిధంగా, 99.3 శాతం డిజిటైజేషన్ పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచిన బీఎల్వోను ప్రత్యేకంగా అభినందించారు.

# ఓటర్ల జాబితా డిజిటైజేషన్‌ను వేగవంతం చేయాలి: ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయబాబు



**ఉంగుటూరు,పబ్లిక్ వ్యూ: జూలై 9:**:ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తి చేసేందుకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉన్నందున బీఎల్వోలు ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా డిజిటైజేషన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయబాబు సూచించారు.

గురువారం ఆయన రాచూరు, కైకరం గ్రామాల్లో పర్యటించి బీఎల్వోలు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీసి, నిర్ణీత గడువులోపు ప్రతి వివరాన్ని కచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. డిజిటైజేషన్ పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని ఆయన అభినందించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# అడ్డతీగల ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ. ఎంపీడీవో కుమార్..





**అడ్డతీగల, పబ్లిక్ వ్యూ: జూలై 9:**అడ్డతీగల మండలం లో "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ "(ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ) గురువారం 69.43 సర్వే శాతం పూర్తి అయ్యింది అని అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు. కొత్తంపాలెం పిఎస్ నెంబర్100, కొనలోవ పి ఎస్ నెంబర్98, లోతవారివీధి పి ఎస్ నెంబర్ 143 పోలింగ్ కేంద్రాలను పరిశీలించరూ, పోలవరంజిల్లాలో అడ్డతీగల మండలం చాలా వెనకబడి ఉన్నదని ఎంపీడీవో తెలిపారు. బి ఎల్ ఓ లు అందరూ మరియు వారి సహాయకులు ప్రతి ఇంటికి వెళ్ళి సర్వేను వేగవంతంగ చెయ్యాలని ,నిర్ణీత గడువులోగా పూర్తి చేయవలసిందిగా ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియ నెల 14 తో ముగియనున్న నేపద్యంలో ఓటు హక్కు కలిగియున్న ప్రతి ఒక్కరూ, తమ పూర్తి వివరాలు బూత్ లెవెల్ అధికారికి సమర్పించాలి అన్నారు. ఈ ప్రక్రియ లో ఓటు హక్కు ఉన్న వారు ఎవరు నిర్లక్ష్యము చేసిన ఓటు హక్కు పోయే ప్రమాదం ఉందని, అలాగే భవిష్యత్తు లో ఓటు హక్కు ఉండదు అని ఎంపీడీవో తెలిపారు.

సర్వే పక్రియ పారదర్శకంగా చేస్తూ , డిజిటలైజేషన్ చేయవలసిందిగా అధికారులకు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు.

# భవన నిర్మాణాల అనుమతులు సులభతరం





**క్రెడాయ్ సమీక్షలో కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం,పబ్లిక్ వ్యూ: జూలై 9:**నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాల అనుమతులకు సంబంధించి జాప్యం లేకుండా సులభతరం చేసినట్లు కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ తో కలిసి కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) - నగర శాఖ సభ్యులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, భవన నిర్మాణ అనుమతులపై చర్చించారు. నైతిక విలువలు, పారదర్శకతను పెంపొందిస్తూ.. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా తమ సంఘం సేవలు అందిస్తున్నట్లు క్రెడాయ్ సభ్యులు తెలిపారు. నగరపాలక సంస్థకు ఆదాయం చేకూరేలా.. నిర్మాణ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సలహాలు, సూచనలను అందించారు. నూతన లేఅవుట్లు, నిర్మాణ ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చవలసిందిగా సభ్యులు కోరారు. గత పుష్కరాలలో నగరంలో రోడ్ల విస్తరణ జరిగిందని.. రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా చాలా చోట్ల ప్రాధాన్యతక్రమంలో రోడ్లను విస్తరణ చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి నిబంధనలను సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. భవనాలకు సంబంధించి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ నగరపాలక సంస్థ ఇస్తుందని.. మార్టిగేజ్ రిలీజ్ రుడా పరిధిలో ఉంటుందని తెలిపారు. నూతనంగా నిర్మించే భవనాలకు ప్రజల భద్రత దృష్ట్యా ర్యాంపులు రోడ్ల మీదకు రాకూడదని స్పష్టం చేశారు. ప్రతి నెలా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం అవుతానని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కలిసికట్టుగా రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి పరచుకోవడంతో పాటు పుష్కరాలను విజయవంతంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. సమీక్షలో సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే శ్రీ రిత్విక మృతి



**జీలుగుమిల్లి,పబ్లిక్ వ్యూ: జూలై 9:** వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే నాలుగు సంవత్సరాల పాప చనిపోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి విజయ్ భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుట్టాయిగూడెం మండలం కొరసావారిగూడెం పంచాయతీ మోతుగూడెం గ్రామానికి చెందిన గోగుల శ్రీ రిత్విక జ్వరం రావడంతో ఈనెల నాలుగవ తేదీన బుట్టాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేశారని తెలిపారు. అక్కడ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వాళ్ళనే సోమవారం చనిపోవడం జరిగింది అని అన్నారు. మృతురాలు తల్లిదండ్రులను పరామర్శించి బియ్యం ,సరుకులు అందజేశారు. వైద్య సిబ్బంది నీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బంది అసమర్థత ,నిర్లక్ష్యం, వైఫల్యం వలనే శ్రీ రిత్విక చనిపోయిందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి శ్రీ రిత్విక కు వైద్య సహాయం ఎలా అందించారు అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు సరైన వైద్యం అందజేయాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో గిరిజన గ్రామాలలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చి డిపి కుటుంబరావు, జిల్లా ఎస్టీ చల్ చైర్మన్ కంగాల రాంబాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు అమర్ తుల యేసు పాదం ,పాస్టర్ అసోసియేషన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మడివి జోసఫ్, మండల నాయకులు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి.



**ఏపీటీఎఫ్ 1938 కవిటి మండల శాఖ**

**కవిటి(పబ్లిక్ వ్యూ)జూలై9:**రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులకు, ఉద్యోగస్తులకు వేతన సవరణ (పీఆర్సీ)ను తక్షణమే అమలు చేయాలని,పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి మధ్యంతరభృతి వెంటనే ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 కవిటి మండలశాఖ అధ్యక్షులు శ్రీరామమూర్తి బిసాయి అన్నారు.వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండలం లో వివిధ పాఠశాలలు సందర్శించి ఏపీటీఎఫ్ 1938 కవిటి మండలబృందం ఉపాధ్యాయుల
సభ్యత్వ నమోదు చేశారు. ఏపీటీఎఫ్ బృందం పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు,ఉపాధ్యాయ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయగలమని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు.ఈ వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరామ్ మూర్తి బిసాయి,భాగ.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి బల్ల. ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శమల్లరాజబాబు, మొర్రి గోపి గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రంగారావు,కార్యవర్గ సభ్యులు అనుపోజు.హిమ కుమార్,పర్రి సాయిరాజ్, కేశవ.పురియ,త్రిలోచన. బిసాయి రిటైర్డ్ ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్ కార్యకర్త మొగలిపురి. ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# సిరిగిందలపాడులో జూలై 12న ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం


**గంగవరం/ రంపచోడవరం, పబ్లిక్ వ్యూ: జూలై 9:**రామకృష్ణ మిషన్, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ తెలిపారు.ఈ శిబిరంలో సాధారణ వ్యాధులు, ఆయాసం, గుండె సంబంధిత సమస్యలు, దద, రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి వ్యాధులకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తారు.అదేవిధంగా వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తుంది. శుక్లం (క్యాటరాక్ట్) ఉన్న రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.మూర్ఛ (ఫిట్స్) వ్యాధితో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ బృందం పరీక్షలు నిర్వహించి నాలుగు నెలలకు సరిపడా ఉచిత మందులను పంపిణీ చేయనుంది.వైద్య శిబిరానికి వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులను వెంట తీసుకురావాలని స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ సూచించారు. ఈ ఉచిత వైద్య సేవలను గిరిజనులు, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా సంబలదీవి పోతురాజు బాధ్యతల స్వీకరణ



**కాకినాడ రూరల్, పబ్లిక్ వ్యూ: జూలై 9:** పశ్చిమ గోదావరి జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సంబలదీవి పోతురాజు పదోన్నతిపై కాకినాడ రూరల్ మండల తహశీల్దార్‌గా నియమితులై గురువారం బాధ్యతలు స్వీకరించారు.ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాకినాడ రూరల్ మండల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం కలిగిన పోతురాజు ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారని సహచర అధికారులు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాల జారీతో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కాకినాడ రూరల్ మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, భూ వివాదాల పరిష్కారం, ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తహశీల్దార్ పోతురాజు తెలిపారు. మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు,సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# అనధికార ఫ్లెక్సీల తొలగింపులో జాప్యం



**కాకినాడ , పబ్లిక్ వ్యూ: జూలై 9:** కాకినాడ నగరంలో అనధికార ఫ్లెక్సీల తొలగింపులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నప్పటికీ, వాటి పరిష్కారంలో ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు.49వ వార్డులోని నాన్సీ వీధిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని మూడు నెలల క్రితమే ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికుడు పితాని రాము తెలిపారు. ఫిర్యాదుతో పాటు ఫొటోలు పంపించినప్పటికీ అధికారులు స్పందించలేదని ఆయన ఆరోపించారు.

అదే సమయంలో బాలాజీ చెరువు సెంటర్‌లోని ఓ జ్యూస్ దుకాణంపై ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొంటూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అనధికార ఫ్లెక్సీల తొలగింపులో మాత్రం ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు.జిల్లా కలెక్టర్ అనధికార ఫ్లెక్సీల తొలగింపునకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటి అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించని అధికారులపై ప్రభుత్వం, సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# తుని ఏరియా ఆసుపత్రికి రూ.30 లక్షల అత్యాధునిక వైద్య పరికరాలు






ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం

**కాకినాడ/తుని,పబ్లిక్ వ్యూ: జూలై 9:** తుని ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చే దిశగా కెనరా బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో సమకూర్చిన రూ.30 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ప్రభుత్వ విప్,తుని ఎమ్మెల్యే యనమల దివ్య గురువారం ప్రారంభించారు.కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ గణేష్, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆపరేటెడ్ సీఆర్ కంపాటిబుల్ ఆపరేషన్ టేబుల్, ఆర్థోపెడిక్ డ్రిల్లింగ్ యూనిట్, డబుల్ సర్ఫేస్ ఫోటోథెరపీ యూనిట్, మేజర్ ఆర్థోపెడిక్ ఇన్‌స్ట్రుమెంట్ సెట్, సర్జికల్ హెడ్‌లైట్, సీఆర్ సిస్టమ్ విత్ ప్రింటర్, 12-చానల్ ఈసీజీ యంత్రం, సెమీ ఆటోమేటెడ్ బయోకెమిస్ట్రీ అనలైజర్, మసిల్ స్టిమ్యులేటర్, అల్ట్రాసౌండ్ థెరపీ యూనిట్, అడ్వాన్స్‌డ్ ఐఎఫ్‌టీ థెరపీ యూనిట్ తదితర పరికరాలను ప్రారంభించారు.అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ విభాగాన్ని ప్రారంభించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ,ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.30 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందించిందని తెలిపారు.ఈ పరికరాల ద్వారా ఫిజియోథెరపీ వంటి సేవలు ఇకపై ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా అందుబాటులో ఉంటాయని, ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అదనపు ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదన్నారు.ప్రస్తుతం తుని ఏరియా ఆసుపత్రిలో రోజుకు 10 నుంచి 15 ప్రసవాలు, 15 నుంచి 20 శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్న ఆయన,ఆసుపత్రిని 200 పడకల సామర్థ్యంతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.త్వరలో ఐటీ అండ్ హెచ్ (ఐటిడ హెచ్) ల్యాబ్, పూర్తిస్థాయి బ్లడ్ బ్యాంక్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య సేవల అభివృద్ధికి ప్రైవేట్ సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ,కెనరా బ్యాంక్ అందించిన రూ.30 లక్షల విరాళంతో సుమారు 12 రకాల అత్యాధునిక వైద్య పరికరాలు ఆసుపత్రికి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.ముఖ్యంగా గతంలో లేని ఫిజియోథెరపీ సేవలు ప్రారంభం కావడంతో ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే చికిత్స పొందే అవకాశం ఏర్పడిందన్నారు.అలాగే పాత ఎక్స్‌రే యంత్రాల స్థానంలో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తుని ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, తుని నియోజకవర్గంలో ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డా.కె. మహేశ్వరరావు,ఆర్ఎంఓ డా. సత్యనారాయణ,బయోమెడికల్ ఇంజనీర్ వెంకటరాజా,వైద్యులు, నర్సింగ్ అధికారులు,ఆసుపత్రి సిబ్బంది, కెనరా బ్యాంకు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలి

ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'టీమ్ జెన్ గ్రీన్' ప్రారంభం



**కాకినాడ,పబ్లిక్ వ్యూ: జూలై 9::** పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్.ఎన్. నాయుడు, ప్రముఖ దంత వైద్య నిపుణులు డా.అడ్డాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో డా.నాయుడు,డా. అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి "టీమ్ జెన్ గ్రీన్" కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డా.నాయుడు మాట్లాడుతూ,పర్యావరణాన్ని పరిరక్షించడం యువత బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన భూమిని అందించాలంటే పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచాలని,ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించాలని సూచించారు. పునర్వినియోగం,రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు లేదా ఇతర ముఖ్యమైన సందర్భాల్లో మొక్కలు నాటే అలవాటు పెంపొందించుకోవాలని కోరారు.దంత వైద్య నిపుణులు,'ఆల్ ఈజ్ వెల్' సభ్యులు డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం జూలై 9న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్రను గుర్తుచేస్తూ యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు.ఆదిత్య కళాశాల, 'ఆల్ ఈజ్ వెల్' సంయుక్తంగా ప్రారంభించిన "టీమ్ జెన్ గ్రీన్" ద్వారా కాకినాడ నగరంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులను ఈ పర్యావరణ ఉద్యమంలో భాగస్వాములను చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డా. స్నేహ,ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తేజేశ్వరరావు,అశ్విని, టీమ్ జెన్ గ్రీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల సత్వర పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి





కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పబ్లిక్ వ్యూ: జూలై 9::** ఎస్సీ, ఎస్టీలపై జరిగే అత్యాచార కేసులను సత్వరంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో గురువారం జిల్లా స్థాయి పీసీఆర్ ఢ పీఓఏ (పీసీ ఆర్ ఢ పీఓఏ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలపై జరిగిన అత్యాచార కేసుల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కాకినాడ, పెద్దాపురం డివిజన్ల డీఎస్పీలు, డివిజనల్ రెవెన్యూ అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని, అలాగే ప్రతి నెల చివరి శనివారం ప్రతి తహశీల్దార్ పరిధిలో సివిల్ రైట్స్ డే సమీక్షా సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మానిటరీ రిలీఫ్ బడ్జెట్‌పై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, 2023, 2024, 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి మొత్తం 375 మంది బాధితులకు రూ.3,52,87,015 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్, కాకినాడ, కాకినాడ మరియు పెద్దాపురం డివిజన్ల డీఎస్పీలు, డివిజనల్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షురాలుగా కొంకిపూడి రాజ్యలక్ష్మి...


AIM AMBEDKAR'S INDIA MISSION
Regd No. : BK4-68/2016

10 YEARS ANNIVERSARY 2016-2026

Working President : Konki Hari Krishna

**నియామక ప్రకటన**

అంబేద్కర్స్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, దళిత బహుజన సమాజ ఆశాజ్యోతి, మాన్య శ్రీ పి.వి. సునీల్ కుమార్ IPS గారి నిర్ణయం మేరకు, మహిళా శక్తిని సంఘటితం చేసి ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయాలనే లక్ష్యంతో కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సీనియర్ మహిళా నాయకురాలు శ్రీమతి కొంకిపూడి రాజ్యలక్ష్మి గారిని నియమించడం జరిగింది.

ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో కాకినాడ జిల్లా మహిళా విభాగం మరింత బలోపేతమై, అంబేద్కర్స్ ఇండియా మిషన్ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పి, సామాజిక మార్పు కోసం సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వసిస్తున్నాము

ఈ నూతన బాధ్యతల్లో శ్రీమతి కొంకిపూడి రాజ్యలక్ష్మి గారు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, అంబేద్కర్స్ ఇండియా మిషన్ నాయకులు, కార్యకర్తలు, సంపూర్ణ సహకారం అందించాలని కోరుతున్నాము.

శ్రీమతి కొంకిపూడి రాజ్యలక్ష్మి గారికి హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు

జై భీమ్
Yours Sincerely

Konki Harikrishna,
Working President,
Ambedkar's India Mission

AMBEDKAR'S INDIA MISSION AIM

Address: Ambedkar Ring Road, Near Jakkampudi, Vijayawada-520012.
+91 9392058830
aimindian1966@gmail.com

**శంఖవరం పబ్లిక్ వ్యూ: జూలై 9::-** అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.వి. సునీల్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు



అంబేడ్కర్ ఇండియా మిషన్ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయాలనే లక్ష్యంతో దళిత ఉద్యమ సీనియర్ మహిళా నాయకురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి ని కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమించినట్లు ఓ ప్రకటన ద్వారా ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్తూ, మహిళా శక్తిని సంఘటితం చేసి

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా సాధించడం,ప్రతి దళితవాడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయించడం,ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు పూర్తిస్థాయిలో దళితుల అభివృద్ధికే వినియోగించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం, డా. బి.ఆర్. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమానం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. కాకినాడ జిల్లా మహిళా విభాగం మరింత శక్తివంతమై, అంబేడ్కర్ ఇండియా మిషన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేస్తూ, దళితుల హక్కుల సాధన కోసం అంకితభావంతో సేవలందించి, సంస్థను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తానని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లాలో గల పలువురు దళిత ఉద్యమ నాయకులు ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, నాయకత్వంలో కాకినాడ జిల్లా మహిళా విభాగం మరింత బలోపేతమై, అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పి, సామాజిక మార్పు కోసం సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వసించారు.

# ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి



**ఆలమూరు, పబ్లిక్ వ్యూ: జూలై 9:** ట్రాక్టరుతో పొలం దున్నుతూ ప్రమాదానికి గురై డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామంలో చోటుచేసుకుంది.స్థానిక ఎసై జి నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం చెముడులంక గ్రామానికి చెందిన పాలూరి పుల్లయ్య(47) గురువారం ట్రాక్టర్ తో పొలం దున్న డానికి బడుగువానిలంక వెళ్లాడు. ఆ సమయంలో జరిగిన ప్రమాదంలో ట్రాక్టరు వెనుక ఉండే ట్రిల్లర్ లో కాలు పడి నుజ్జునుజ్జ అయ్యింది. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు.దీనిపై ఎసై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్ట్ మెట్రిక్ హాస్టల్ పరిశీలించిన ఐటీడీఏ పీవో

- పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోతే కఠిన చర్యలు
- ఏపీఆర్ జెసి ప్రిన్సిపాల్ ని మందలించిన ఐటీడీఏ పీవో




**కొయ్యూరు, పబ్లిక్ వ్యూ: జూలై 9:** కాకరపాడు జూనియర్ కళాశాలలోపరిసరాలను పరిశుభ్రంగా ఉండకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ హెచ్చరించారు. గురువారం మండలంలోని పర్యటించిన ఐటీడీఏ పీవో ముందుగా కాకరపాడు పోస్ట్మెట్రిక్ హాస్టల్ ఖాళీగా ఉండటంతో పరిశీలించి ఇక్కడ ఐటీడీఏ తరఫున ప్రజలకు ఉపయోగపడే విధంగాఏదైనా పెట్టడానికి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అలాగే కాకరపాడు ఏపీఆర్జేసీ జూనియర్ కళాశాలను పరిశీలించారు. కాలేజీ టాయిలెట్లను పరిశీలించి పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రిన్సిపాల్ సత్యనారాయణ మందలించారు ఇకపై శుభ్రంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం కాలేజీ ఎదురుగా ఉన్న పూరి గుడిసెలను ఖాళీ చేయించాలని గ్రామస్తులు తెలపడంతో సంబంధిత అధికారైన తాసిల్దారుకు చెప్పి ఈ విషయంపై త్వరితగతిన ఖాళీ చేయించాలని తాసిల్దార్ ప్రసాదుకు పిఓ ఆదిత్య వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యుఓ క్రాంతి కుమార్, కాలేజీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతును ఎన్నాళ్ళు ఆపగలరు.




**గుమ్మలక్ష్మీపురం పబ్లిక్ వ్యూ: జూలై 9:.**గిరిజన సంఘాల నాయకులు,ఎస్ఎఫ్ఐ నాయకులను గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు గురువారం నాడు పత్రిక విలేకరులతో అన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో విద్య,వైద్యం,ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యంత కీలక సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు ముందుగానే సమాచారం ఇచ్చి శాంతియుతంగా ఎమ్మెల్యేని కలవడానికి వెళ్తున్న గిరిజన సంఘాల నాయకులు,ఎస్ఎఫ్ఐ నాయకులను గృహ నిర్బంధం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం.సమస్యలను వినాల్సిన ప్రభుత్వం,ప్రశ్నించే గొంతులను అణచివేయడం అత్యంత బాధాకరం.ఏజెన్సీ ప్రాంతాల్లో గత ఏడాది నుంచి ఈ సంవత్సరం వరకు విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయి.మలేరియా,డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రతి ఏడాది విజృంభిస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు దోమతెరలు అందించాలని,ప్రభుత్వ పాఠశాలలు,హాస్టళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరడం తప్పా?.ప్రస్తుతం జ్వరాల సీజన్ కారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకే బెడ్‌పై ఇద్దరు,ముగ్గురు రోగులు చికిత్స పొందాల్సిన పరిస్థితి నెలకొందని.కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.
అలాగే,ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తొలి సంతకంగా ప్రకటించిన ఏఎన్ఎంల నియామకాల హామీ ఇప్పటికీ అమలులోకి రాకపోవడం విచారకరం.ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులను వెంటనే భర్తీ చేసి,ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామ్మన్నారు.గిరిజన ప్రాంతాల హక్కులకు సంబంధించిన జీవో నెం.3 అంశంపై కూడా రాజ్యాంగబద్ధంగా తమ గోడును వినిపించేందుకు వస్తున్న ప్రజా సంఘాల నాయకులను అడ్డుకోవడం సరైన విధానం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది.సమస్యలను అణచివేయడం కాదు,సంబంధిత నాయకులను పిలిపించి చర్చించి పరిష్కార మార్గాలు చూపించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.
ఎస్ఎఫ్ఐ విడుదల చేసిన పాంప్లెట్‌లో పేర్కొన్నట్లుగా గిరిజన విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగించే అంశం.విద్యా మౌలిక వసతుల మెరుగుదల,హాస్టళ్లలో వసతుల కల్పన,వైద్య సేవల బలోపేతం,ఏఎన్ఎంల నియామకం,కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం వంటి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని హితవు పలుకుతున్నామని గౌరీ శంకర్రావు అన్నారు..

## 21 కిలోల గంజాయి స్వాధీనం

- అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్ట్
- ఇద్దరు పరారీ




**డుంబ్రిగూడ పబ్లిక్ వ్యూ: జూలై 9:** డంబ్రిగుడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొందుగూడ గ్రామ సమీపంలో 08-07-2026 తేదీన నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలలో అక్రమంగా తరలిస్తున్న 21 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
డుంబ్రిగూడ ఎస్.ఐ. ఎల్. సురేష్ అందించిన వివరాల ప్రకారం అందిన విశ్వసనీయ సమాచారంతో, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా, ఒడిశా నుండి ఆంధ్రప్రదేశ్ మీదుగా బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్న సాంట్రో కారు (ఒా= 02 బీా 2766) మరియు పైలట్ వాహనంగా ఉపయోగిస్తున్న అపాచీ మోటార్ సైకిల్ (ఒాణ 10 చీ 4912) నెంబర్ గల వాహనాలను అడ్డగించి తనిఖీ చేయగా సాంట్రో కారులో 11 ప్యాకెట్లలో మొత్తం 21 కిలోల గంజాయి లభించగా, గంజాయి, ఒక సాంట్రో కారు, ఒక అపాచీ మోటార్ సైకిల్ మరియు 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని అలాగే నలుగురు నిందితులను అరెస్ట్ చేశామని మరియు ఒక బాలుడిని జువినల్ హోమ్ కి తరలించామని ఎస్ ఐ ఎల్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్ఞాన్ కళాశాలలో ఏఐ ఫర్ సస్టైనబిలిటీపై వర్క్‌షాప్



**కూర్మన్నపాలెం పబ్లిక్ వ్యూ: జూలై 9::**దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో బి.టెక్ విద్యార్థుల కోసం ఏఐ ఫర్ సస్టైనబిలిటీ -- హార్నెసింగ్ ఏఐ టు బిల్డ్ ఎ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై వారం రోజుల వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు . వర్క్‌షాప్‌లో విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుస్థిర అభివృద్ధి సవాళ్లను కృత్రిమ మేధస్సు ద్వారా ఎలా పరిష్కరించవచ్చో అవగాహన కల్పించడంతో పాటు, భవిష్యత్‌కు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించడమే ప్రధాన లక్ష్యం అని కళాశాల యాజమాన్యం తెలిపింది . సెషన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ -- సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగాలకు చెందిన 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో సుస్థిర అభివృద్ధి కోసం కృత్రిమ మేధస్సు పాత్రపై అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన సాంకేతిక ఆవిష్కరణల పట్ల చైతన్యం కల్పించడం ప్రధాన ఉద్దేశం.
సాంకేతిక శిక్షణా కార్యక్రమాన్ని వన్ ఎం వన్ బీ సంస్థకు చెందిన నిపుణుడు నిర్వహించారు . కృత్రిమ మేధస్సు ప్రాథమిక అంశాలు, ఐక్యరాజ్యసమితి రూపొందించిన సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, విద్య, స్మార్ట్ సిటీస్ వంటి రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఇంటరాక్టివ్ డిస్కషన్స్, వాస్తవ జీవిత కేస్ స్టడీస్, హ్యాండ్స్-ఆన్ డెమాన్‌స్ట్రేషన్స్, సహకార అభ్యాస కార్యక్రమాల ద్వారా సామాజిక, పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించడంలో కృత్రిమ మేధస్సును ఎలా సమర్థవంతంగా వినియోగించాలో విద్యార్థులకు వివరించారు.
నిర్దేశిత లెర్నింగ్ మాడ్యూల్స్, అసెస్‌మెంట్స్ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఈవై, మైక్రోసాఫ్ట్, ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ నుంచి అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లు అందజేశారు . సర్టిఫికేషన్లు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన సామర్థ్యాలను పెంపొందించి, భవిష్యత్ ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌ను సంబంధిత విభాగాల అధ్యాపకులు సమన్వయం చేస్తూ, కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు కృషి చేయడంతో పాటు విద్యార్థులు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు, ఇండస్ట్రియల్ రిలేషన్స్ డీన్ డా. చి. రోహిణి కుమార్ మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధితో కృత్రిమ మేధస్సును అనుసంధానం చేయడం నేటి అవసరమని, సమాజ సమస్యలకు వినూత్న సాంకేతిక పరిష్కారాలను అందించగల భావి ఇంజినీర్లను తీర్చిదిద్దడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ పరిశ్రమ ఆధారిత శిక్షణను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లను సాధించి తమ వృత్తి జీవితానికి మరింత బలమైన పునాది వేసుకోవాలని వారు ఆకాంక్షించారు.

## అనధికార అదన అంతస్తు నిర్మాణం పై స్థానికులు ఆందోళన

- సా(స)ర్ బాగా బిజీ... నిర్మాణదారునికి మధ్యవర్తి గా ప్లానింగ్ సెక్రెటరీ"ప్లానింగ్ వేరు"
- గ్రామ సచివాలయానికి కూత వేటు దూరంలో భవన నిర్మాణం కళ్ళు మూసుకున్న ప్లానింగ్ సెక్రటరీ
- బిఏ నెంబర్లు ఇవ్వడం లేట్ అవుతుంది ఫోన్ నెంబర్ కావాలా! మాట్లాడుతారా!

**విశాఖ తూర్పు పబ్లిక్ వ్యూ: జూలై 9:** జీవీఎంసీ11వ వార్డు 16 వ గ్రామ సచివాలయం పరిధిలో సుమారు మూడు మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డుకు అనుకుని భారీ అదన అంతస్తు భవనం నిర్మాణంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తు నిర్మాణం జరుగుతుందనీ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.
నిర్మాణపు వివరాలువివరాలు కోరితే సర్ లో బిజీగా ఉన్నాము, అంటూ నిర్మాణదారుని ఫోన్ నెంబర్ ఇమ్మంటారా ! మాట్లాడమంటారా !అని మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నా గ్రామ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ. నిర్మిస్తున్ననిర్మాణం పై వివరాల కోసం గ్రామ సచివాలయం కు వెళ్లిన వారికి ప్లానింగ్ సెక్రటరీ ఇచ్చే సమాధానం ఇదే ...ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని,ముస్తఫా కాలనీ పరిసర ప్రాంతాలు లో త్రాగునీటికి కష్టాలు ఎక్కువయ్యాయని ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో త్రాగినీటి సమస్య తీవ్రంగా ఉందని,నిర్మాణ అవసరాల కోసం బోర్వెల్ తవ్వడం వలన సమస్య మరింత పెరిగిందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మూడు మీటర్ల రోడ్డులో భారీ భవన నిర్మాణం తో జరగకూడని సంఘటన జరిగిన దానికి బాధ్యులు ఎవరు !నిర్మాణం పై జీవీఎంసీఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి అక్రమాలు తేలితే నిర్మాణాన్ని నిలిపేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించి అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని, వాటికి ప్రోత్సహిస్తున్న సిబ్బంది పై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు



## నేడు13 వ వార్డులో 'రెవెన్యూ సదస్సు"

**9,10,11,12,13,వార్డుల రెవెన్యూ సమస్యల పరిష్కారావేదిక:**

**టీడీపీ వార్డు అధ్యక్షులు ఏడువాకు సన్యాసిరావు**

**విశాఖ తూర్పు, పబ్లిక్ వ్యూ: జూలై 9:** జీవీఎంసీ13వ వార్డు ఆరిలోవ చివరి బస్ స్టాప్ వద్ద నేడు శుక్రవారం ఉదయం 10 గంటలకు జీవీఎంసీ కళ్యాణ మండపం లోఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు అధ్యక్షతన 9,10,11,12,13 వార్డుల రెవెన్యూకు సంబందించిన సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నామని,ఈ సదస్సులో శాసనసభ్యులతో పాటు,జిల్లా రెవెన్యూ అధికారులు,మండల రెవెన్యూ అధికారులు పాల్గొని రెవెన్యూ సమస్యలు ఏవైతే ఉన్నాయో వాటిని గ్రీవెన్స్ ద్వారా పరిష్కరించేందుకు వీలుగా ప్రజలు వేదికను ఉపయోగించుకోవాలని, 13వ వార్డు టిడిపి అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు తెలిపారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు విధిగా రసీదులు పొందాలని తెలిపారు.



## 1.80 కోట్లతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



**పెదగూడ నుండి కొడాపుట్టు ఘాటీ వరకు రోడ్డు నిర్మాణం.**

**టీడీపీ డివిజన్ నాయకుడు, తాజా మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి.**

**ముంచంగిపుట్టు, పబ్లిక్ వ్యూ: జూలై 9:**అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండల పరిధిలో పెదగూడ నుండి కొడాపుట్టు ఘాటీ వరకు ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ నుండి 1.80 కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేసినట్లు స్థానిక తాజా మాజీ సర్పంచ్, టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ కిడారి సర్వేశ్వరరావు హయాంలో మంజూరు అయినా రోడ్డు అని, అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరవాత రోడ్డును పట్టించుకోక ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత రోడ్ల నిర్మాణాలు పరుగులు పెట్టిస్తుందనన్నారు. పెదగూడ నుండి కొడాపుట్టు రోడ్డు నిర్మాణం పూర్తయితే పెదగూడ, దారెలా పంచాయతీల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాండురంగ స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, పెదగూడ మాజీ సర్పంచ్ బాబురావు, దారెలా స్థానిక ఎంపీటీసీ పాంగి మల్లికార్జున, పెదగూడ ఎంపీటీసీ మన్మథరావు, మాజీ మండల అధ్యక్షులు కిల్లో బలరాం, పెదగూడ మాజీ సర్పంచ్ కూటమి నాయకులతో రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పెదగూడ పంచాయతీ టీడీపీ అధ్యక్షులు జోగేష్, జనసేన నాయకుడు నాగేష్ కూటమి నాయకులు సుబ్రహ్మణ్యం, అచ్చిబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలి



**జగ్గంపేట, పబ్లిక్ వ్యూ: జూలై 9:**గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన వేలాది మంది పేద కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్, జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గంపేట మండలంలోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోందని చెప్పారు. ఈ పథకంలో పనిచేసే కూలీలు రోజువారి కూలిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని, అలాంటి వారి పరిస్థితిని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పని చేసి నెల రోజులు పూర్తవుతున్నా ఇప్పటికీ కూలి డబ్బులు అందక వేలాది మంది కూలీలు అప్పుల పాలై, కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గొప్ప పరిపాలన అందిస్తున్నామని ప్రచారం చేసుకుంటూ సంబరాలు చేసుకుంటోందని, కానీ పని చేసిన పేదల చెమటకు తగిన ప్రతిఫలం ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన ప్రతి కూలీకి వేతనాలను వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

## ఓటరు నమోదుపై విస్తృత అవగాహన



**జగ్గంపేట, పబ్లిక్ వ్యూ: జూలై 9::** జగ్గంపేట గ్రామంలో సర్ ఓటరు నమోదు కార్యక్రమంపై రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. జగ్గంపేట గ్రామంలో బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలతో కలిసి ఇంటింటా పర్యటించిన కొండబాబు ప్రజలకు ఓటు విలువ గురించి అవగాహన కల్పించారు. ఓటు మన ప్రజాస్వామ్యానికి హక్కు, ఓటు ఒక వజ్రాయుధం, ఓటు ఉంటేనే దేశ భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును మార్చగల శక్తి మనకు ఉంటుందన్నారు. జూలై 14తో ఓటు నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందని ఆలోపు అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రోతు బుజ్జి, బిఎల్‌ఓ మౌళి, కుప్ప శ్రీను తదితరులు పాల్గొన్నారు.ం

## ఏడువారాల వెంకన్న నిత్య అన్నదానానికి రూ.1,00,005 విరాళం



**ఆత్రేయపురంపబ్లిక్ వ్యూ: జూలై 9:**ఏడువారాల చందన వెంకటేశ్వర స్వామిగా విరాజిల్లుతున్న వాడపల్లి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. గురువారం స్వామివారి సన్నిధిలో అష్టోత్తరం నిత్య కళ్యాణం పూజా కార్యక్రమం అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.శ్రీ చందన వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేస్తున్నారు. నిడదవోలు పట్టణానికి చెందిన గుంటుపల్లి నాగ సూర్య చంద్రం కుటుంబ సభ్యులు రూ.1,00,005 విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో దాతలను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అసిస్టెంట్ అధికారి వై.శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

## చొప్పెల్ల అమ్మవారి చీరలు పేదలకు పంపిణీ

✹ ప్రశంసలు అందుకుంటున్న ఆలయ కమిటీ



**ఆలమూరు, పబ్లిక్ వ్యూ: జూలై 9:;**గ్రామ దేవతల జాతర్లు, తీర్థ మహోత్సవాల సందర్భంగా ఆయా అమ్మవార్లకు వచ్చే చీరలను దేవస్థానం కమిటీ వాళ్ళు వేలం నిర్వహించి ఆదాయం కల్పిస్తారు. అయితే ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర,తీర్థ మహోత్సవం సందర్భంగా వచ్చిన సుమారు 250 చీరలను రాజమహేంద్రవరంలో వృద్ధాశ్రమాలలో ఉండే వృద్దులకు,అనాధ మహిళలకు, రోడ్ల పక్కన ఉండే యాచకులకు పంపిణీ చేసి ఎన్నో ఆలయ కమిటీలకు ఆదర్శంగా నిలిచారు.పేదవారికి కులాలు మతాలు తెలియవు సహాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడం తప్ప.ఆలయ కమిటీ నిర్వాహకులకు వచ్చిన ఈ ఆలోచన చాలా ప్రశంసనీయం.ఈ కమిటీకి చెందిన పిల్లా నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.

# పాము కాటుకు గురై గిరిజన బాలిక మృతి.






✹ అధికారుల నిర్లక్ష్యమే కారణమని సీపీఎం ఆరోపణ

**చింతూరు, పబ్లిక్ వ్యూ: జూలై 9:** కార్మన్‌కొండ గ్రామానికి చెందిన కొండరెడ్డి గిరిజన యువతి సమ్మక్క ప్రియ (18) పాము కాటుకు గురై సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘటనపై సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లోతా రామారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చింతూరులో సీసం సురేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన గ్రామాలకు ఇప్పటికీ కనీస రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల బాధితురాలిని బంధువులు డోలీలో మోసుకుంటూ నాలుగు కొండలు దాటి కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాల్సి వచ్చిందన్నారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడం, అనంతరం చింతూరు ఏరియా ఆసుపత్రి, భద్రాచలం, విజయవాడ తదితర ప్రాంతాల్లో కూడా సకాలంలో మెరుగైన వైద్యం అందకపోవడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. అత్యవసర పరిస్థితిలో చింతూరు ఐటీడీఏ అధికారికి ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని, గిరిజనుల ప్రాణాల పట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరిని ఇది స్పష్టం చేస్తోందన్నారు. బాధితురాలికి చికిత్స అందించేందుకు నిరాకరించిన ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలవరం జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని కోరిన లోతా రామారావు, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మన్‌కొండతో పాటు పరిసర గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించాలని, అత్యవసర సమయంలో స్పందించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు పాము కాటు నివారణకు అవసరమైన యాంటీ స్నేక్ వెనం మందులను తగిన నిల్వల్లో ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, బాబు బొర్రయ్య, చింత రాంబాబు, వెంకమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి జగన్మోహిని కేశవస్వామి నిత్య అన్నదానానికి రూ.10,116 విరాళం






**ఆత్రేయపురం పబ్లిక్ వ్యూ: జూలై 9: :** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం లో గురువారం భక్తులతో కిక్కిరిసింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి శ్రీ జగన్మోహిని కేశవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తున్నారు. వేట్లపాలెంకు చెందిన జోస్యుల సూర్య నవీన్ ప్రసాద్--దివ్య దంపతులు రూ.10,116లను విరాళంగా సమర్పించి అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించారు. ఆలయ అర్చకులు దంపతుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించి స్వామివారి అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు. ఆలయ వేదపండితులు వెంకట అవధాని వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేశారు. ఆలయ అసిస్టెంట్ అధికారి ఎం. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో దంపతులను ఘనంగా సత్కరించారు.

ఐదు బుధవారాల సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోందని, దర్శనం, పూజలు, నిత్య అన్నదాన కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారని పేర్కొన్నారు.

## మంత్రి సుభాష్ పిలుపుతో ద్రాక్షారామం అగ్నిబాధితులకు అండగా దాతలు.. రూ.5 లక్షల విరాళం



**ద్రాక్షారామం, పబ్లిక్ వ్యూ: జూలై 9::** ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత వ్యాపారులను ఆదుకునేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన పిలుపుకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభిస్తోంది.మానవత్వానికి పెద్దపీట వేస్తూ తెలుగుదేశం పార్టీ నాయకుడు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) గురువారం రూ.5 లక్షల విరాళం చెక్కును సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు అందజేశారు.ద్రాక్షారామం మార్కెట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఈ విరాళాన్ని అందించిన రేవు శ్రీనును వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ,అగ్నిప్రమాదంలో జీవనాధారాన్ని కోల్పోయిన వ్యాపారులను ఆదుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన పిలుపును హృదయపూర్వకంగా స్వీకరించి,పెద్ద మొత్తంలో విరాళం అందించిన రేవు శ్రీను సేవాభావం ఆదర్శనీయమని కొనియాడారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే గొప్ప మానవతా విలువ అని పేర్కొన్నారు.మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో బాధిత కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా,పునరావాసం, ఉపాధి,భవిష్యత్తుపై భరోసా కల్పించే చర్యలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.బాధితులు ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని,ప్రతి కుటుంబానికి ప్రభుత్వం,మంత్రి సుభాష్ అండగా ఉంటారని స్పష్టం చేశారు.

ద్రాక్షారామం అగ్నిబాధితుల కోసం పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్న దాతలందరికీ వాసంశెట్టి సత్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సమాజం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరి సహకారం బాధిత కుటుంబాల్లో కొత్త ఆశలను నింపుతోందన్నారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన ప్రతి వ్యాపారికి న్యాయం జరిగేలా కొత్తగా నిర్మించిన షెడ్లను పారదర్శకంగా కేటాయించి దుకాణాలు అప్పగించినట్లు తెలిపారు.మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రతిపాదించిన "ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన సేవ" అనే భావనకు దాతల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందన ద్రాక్షారామం ప్రజల్లో ఐక్యత,మానవత్వం,సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తోందని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో శిక్షణ.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పబ్లిక్ వ్యూ: జూలై 9::**మండల కేంద్రమైన ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం, సెర్ప్ (వెలుగు) సమన్వయంతో రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ప్రకృతి వ్యవసాయం జిల్లా డిపిఎం ఎలియాజర్ వెలుగు డిపిఎం లు,వి బి ఆర్ రాయ్, అశోక్ భరత్,ప్రత్తిపాడు వ్యవసాయ అధికారి శ్రీమతి జోకా అమృత ,వెలుగు ఏపిఎం వై. వెంకటరావు ,ప్రకృతి వ్యవసాయం ఎం ఎం టి ఎల్ నికేశ్ వర్మ , వై గణేష్ అలాగే 26 జిల్లాల నుంచి అడిషనల్ డిపిఎంలు, ఎం ఎం టి ఎల్ ఎస్ లు, ఎన్ పి ఎం, ఎం టి ఎస్ లు హాజరయ్యారు

ఈ కార్యక్రమంలో ప్రధానంగా మండలంలో అమలవుతున్న ఫుడ్ బాస్కెట్ అమలు విధానంపై శిక్షణా కార్యక్రమం మరియు గ్రామాల్లోఅమలు జరుగుతున్న విధానంపై అవగాహన కల్పించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ముందుగా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ జి. శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలంలో ముందుగా ఐదు గ్రామాలలో పెద్దిపాలెం ,గోకవరం, ఉత్తరకంచి,లంపక లోవ, బౌరువాక గ్రామాలలో ఈ ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం అమలు చేయడం జరిగిందన్నారు.ఈ విధానం ద్వారా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను తిరిగి మళ్లీ మహిళా సంఘాల ద్వారా సభ్యులకు అందించే విధానం మోడల్ తీసుకొని 26 జిల్లాల నుండి పకృతి వ్యవసాయం సిబ్బంది రావడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రకృతి వ్యవసాయ,సిబ్బంది, వెలుగు సిబ్బంది హాజరయ్యారు.

# వైసీపీలో రావణ మంటలు



**పబ్లిక్ వ్యూ డెస్క్:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో విభేదాల పర్వం తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఆ పార్టీలో ఆలోచించి నాయకులు వర్సెస్ దూకుడు కలిగిన నాయకులు అన్నట్టు పరిస్థితి మారింది. ఏపీలో జోసెఫ్ రావణ్ అరెస్ట్ ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఆయనకు వైసిపి మద్దతుగా నిలిచింది. న్యాయ పోరాటానికి సహాయం అందించింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు అయితే చేస్తే తప్పు ఏంటి అని ప్రశ్నించారు. మేము ఉన్నది అందుకే కదా అన్నట్టు మాట్లాడారు.. అయితే తాజాగా మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందుకు విరుద్ధంగా ప్రకటన చేశారు. జోసెఫ్ రావణ్ కు తమ పార్టీతో అసలు సంబంధం లేదని తేల్చేశారు. అంతర్గతంగా వైసీపీలో పార్టీకి డ్యామేజ్ జరుగుతుందన్న కోణంలోనే పెద్దిరెడ్డి ప్రకటన అని తెలుస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు కూటమి ప్రభుత్వంపై యూట్యూబ్ వేదికగా నిత్య విమర్శలు చేస్తూ వస్తున్నారు జోసెఫ్ రావణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లైన్లో పనిచేస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. తాజాగా ఆయన అరెస్టుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించిన తీరుతో కూడా ఈ అనుమానాలు బలపడ్డాయి. హిందూ దేవుళ్ళతో పాటు దేవతలపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవి తీవ్ర ప్రతికూలత చూపాయి. ఇటువంటి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. రావణ్ అనే వ్యక్తి తమ పార్టీకి చెందిన వాడు కాదని.. తాము అతడిని ఎక్కడినుంచో తీసుకువచ్చి.. కూటమి ప్రభుత్వంపై మాట్లాడించలేదని డిఫెన్స్ మోడ్ లోకి వెళ్లారు. సదరు వ్యక్తి కేవలం పవన్ కళ్యాణ్ ను.. ఆయన విధానాలను మాత్రమే ప్రశ్నించాడని.. దానికి తమకు ముడి పెట్టడం సరికాదని చెప్పుకొచ్చారు. అయితే నిన్నటి వరకు తమ అనుకూల సోషల్ మీడియా నెట్వర్క్ లో.. రావణ్ వీడియోలను విపరీతంగా షేర్ చేస్తూ.. ఓ రేంజ్ లో ఓనర్ షిప్ తీసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు ఒక్కసారిగా ప్లేట్ ఫిరాయించడంతో అసలు సీన్ అర్థం అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూటర్న్ తీసుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆయన పాత వీడియోలు వెలుగులోకి వచ్చాయి. రావణ్ గతంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పై అత్యంత ఘోరమైన, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏకంగా దేశ సార్వభౌమత్యాన్ని, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వీడియోలు వైరల్ అయ్యాయి. అటువంటి వ్యక్తిని నెత్తిన పెట్టుకుంటే బిజెపికి కోపం వస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భయపడుతోంది. అందుకే దానిని వదిలించుకునే పనిలో పడింది. జోసెఫ్ రావణ్ కు మద్దతు తెలిపితే తప్పు ఏంటి అని అంబటి రాంబాబు ప్రశ్నించగా.. ఇప్పుడు అసలు తమకు ఆయనతో సంబంధం లేదని తేల్చేశారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. దీనిపై పార్టీలో చర్చ నడుస్తోంది. దూకుడు గల నేతలను నియంత్రించకపోతే పార్టీకి నష్టమన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి జగన్ మోహన్ రెడ్డి ఎలా స్పందిస్తారో చూడాలి.

మరోవైపు తాజాగా జోసెఫ్ రావణ్ కు చెందిన సెల్ఫోన్లో అశ్లీల వీడియోలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈనెల ఒకటి నాయన అరెస్ట్ అయ్యారు. ఆ సమయంలో ఫోన్ చేస్తాను విశ్లేషించిన పోలీసులు అందులో కీలక సమాచారం ఉన్నట్లు తెలుసుకున్నారు. అయితే అప్పటికే రావని తెలివిగా తన ఫోన్లోని వీడియోలను డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. అలా డిలీట్ చేసిన డేటా కోసం ఫోన్ ను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించారు. ఆ ల్యాబ్ నుంచి వచ్చిన నివేదిక షాకింగ్ అనిపిస్తోంది. అమాయక యువతులను టార్గెట్ గా చేసుకుని వారితో అసభ్యకరంగా ప్రవర్తించడం.. ఏకాంతంగా ఉన్న సమయంలో ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్మెయిల్ చేసినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పుడు మరో కోణం దొరికింది పోలీసులకు. రావణ్ బారిన పడిన బాధితులు ఎంతమంది ఉన్నారన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేశారు. డేటా ఆధారంగా పదిమంది బాధితులను గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో మరింత కఠినమైన కేసులు జోసెఫ్ రావణ్ పై మోపే అవకాశం ఉంది.ఇప్పటికే కఠినమైన చట్టం కింద కేసు నమోదు చేశారు. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుతో రావణ్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ పలు సెక్షన్ల కింద, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ( ఉపా ) సెక్షన్ల కింద అభియోగాలు మోస్తారు. కోర్టులో హాజరు పరచగా ఈనెల 18 వరకు రిమాండ్ విధించారు. అయితే ఇప్పుడు కొత్తగా అమాయక యువతులను టార్గెట్ చేసి.. అశ్లీలంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై అదనపు సెక్షన్లు నమోదు చేసే ఛాన్స్ కనిపిస్తోంది.

# ఏపీలో మాటల మంటలు

**పబ్లిక్ వ్యూ డెస్క్:**
ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన చారిత్రాత్మక విజయంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన తరుణంలో.. రాష్ట్ర రాజకీయాలు మునుపెన్నడూ లేనంతగా వ్యక్తిగత దూషణలు, శాంతిభద్రతల సవాళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలు రగిల్చేందుకు, శాంతిభద్రతల సమస్యలను సృష్టించేందుకు ఒక పక్కా వ్యూహం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. రాయలసీమలోని రాప్తాడు ఫ్యాక్షన్ సెగల నుంచి కోస్తాలోని పెనుమలూరు పొలిటికల్ వార్ దాకా.. గత కొన్ని వారాలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు కేవలం స్థానిక వివాదాలు కాదని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించేందుకు ఒక పెద్ద పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతున్నారని అంటున్నారు. రాయలసీమ సున్నిత ప్రాంతాల్లో పాత కక్షలను మళ్లీ రగల్చడం. ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హఠాత్తుగా తెరపైకి వచ్చి.. దివంగత నేత పరిటాల రవి, ప్రస్తుత మంత్రి పరిటాల సునీతలపై అత్యంత ఘోరమైన, వ్యక్తిగత పదజాలం ఉపయోగించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఫ్యాక్షన్ చరిత్ర ఉన్న అనంతపురం లాంటి జిల్లాలో ఇలాంటి ఉద్రేకం రేపే ప్రసంగాలు చేయడం వెనుక.. ఎలాగైనా స్థానిక కేడర్‌ను ఘర్షణల్లోకి నెట్టాలనే కుట్ర దాగుందని అనుమానిస్తున్నారు. కూటమి శ్రేణులు గనుక సహనం కోల్పోయి ఎదురుదాడి చేస్తే.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు, మాపై దాడులు జరుగుతున్నాయి అని దిల్లీ స్థాయిలో విక్టిమ్ కార్డ్ ప్లే చేసే వ్యూహంతోనే తోపుదుర్తి ఇలా రెచ్చగొడుతున్నారని అధికార పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. కృష్ణా జిల్లా కానూరు లో టీడీపీ జెండా దిమ్మెను ఉద్దేశపూర్వకంగా తొలగించిన వ్యవహారం దుమారం రేపింది. అమరావతిలోనూ వైసీపీ నేతల పర్యటనలో ఉద్రిక్తత ఏర్పడింది. తమ నేతలపైనే దాడులు జరిగాయంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా రంగంలోకి రావడం ఈ పొలిటికల్ స్కెచ్‌లో భాగమేనని అంటున్నారు. ఏపీ రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని ఇతర రాష్ట్రాల యూట్యూబర్లు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను టార్గెట్ చేస్తూ మహిళా నేతలపై అత్యంత జుగుప్సాకరమైన పోస్టులు పెట్టడం, విద్వేషాలను రేపడం పతాక స్థాయికి చేరింది. తాజాగా, దళిత క్రైస్తవ మీటింగుల ముసుగులో పవన్ కళ్యాణ్‌పై, రాజ్యాంగ వ్యవస్థలపై సాయుధ తిరుగుబాటును, నక్సల్స్ ఐడియాలజీని ప్రోత్సహిస్తూ వీడియోలు చేసిన వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ పై గన్నవరం పోలీసులు కఠినమైన ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడం సంచలనంగా మారింది. ఈ అలజడి రాజకీయ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా కేవలం పరిపాలన, సంక్షేమంపైనే దృష్టి పెట్టి శాంతిభద్రతల విషయంలో కొంత ఉదారంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని భావిస్తున్న సీఎం చంద్రబాబు.. ఇప్పుడు హోం శాఖకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. రాజకీయ

నాయకుల ముసుగులో ఉన్నా సరే.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హయాంలో జరిగిన రాక్రీట్ అవినీతి అక్రమాలపై, ఆస్తుల సీజింగ్‌పై లీగల్ ఫోకస్ పెట్టడంతో పాటు.. సోషల్ మీడియా విద్వేషకులకు మద్దతుగా నిలుస్తున్న నటుడు ప్రకాశ్ రాజ్, వైసీపీ సోషల్ మీడియా వింగ్‌పై లీగల్ నోటీసులు, అరెస్టుల పరంపర ప్రారంభం కానుందని భావిస్తున్నారు.

ఏపీ రాజకీయాలు ఇప్పుడు కేవలం అభివృద్ధి-సంక్షేమం అనే చర్చల నుంచి మారి, వ్యవస్థల పరిరక్షణ-శాంతిభద్రతల అదుపు అనే దిశగా సాగుతున్నాయి. ప్రతిపక్షం ఎంతలా రెచ్చగొట్టినా.. కూటమి ప్రభుత్వం చట్టపరమైన ఆంక్షలు, ఉపా లాంటి కఠిన నిబంధనల ద్వారా అరాచకాలను అణచివేసేందుకే మొగ్గు చూపుతోంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకోబోయే ఈ కఠిన చర్యలు అరాచక శక్తులకు అడ్డుకట్ట వేసి రాష్ట్రాన్ని ప్రశాంత మార్గంలో ఉంచుతాయా.. లేక ప్రతిపక్షం మరింతగా సెంటిమెంట్ పాలిటిక్స్ తెరపైకి తెస్తుందా అనేది వేచి చూడాలి

# రెడ్ ఫ్లాగ్ తో వైసీపీ...

**పబ్లిక్ వ్యూ డెస్క్:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక విషయంలో చాలా గర్వపడుతూ వస్తోంది. తాము ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చామని గొప్పగా చెప్పుకుంటూ ఉంటుంది. కానీ మొన్నటి ఎన్నికల్లో ఓటమితో ఆ పార్టీకి అసలు సినిమా అర్థమయింది. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా వెళ్తే ఇబ్బందికరమని ఆ పార్టీ భావిస్తోంది. అలాగని ఆ పార్టీతో కలిసివచ్చే పార్టీలు లేవు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డి స్వయంకృతాపం. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పార్టీతో కూడా చెలిమి లేదు. అసలు ఇతర రాజకీయ పార్టీలను లెక్క చేసేవారు కాదు. ఇప్పుడు అదే ఆ పార్టీకి మైనస్. ఆ పార్టీతో జత కలిసేందుకు ఏ పార్టీ ముందుకు రాని పరిస్థితి. అయితే ఇప్పుడు వామపక్షాల్లో ఒకటైన సిపిఐ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలుస్తోంది. కానీ అది ప్రభుత్వంపై పోరాటం చేసే క్రమంలో. ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శించే క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అనుసరిస్తోంది సిపిఐ. తాజాగా జోసెఫ్ రావణ్ అరెస్ట్ విషయంలో స్పందించారు సిపిఐ నారాయణ. ప్రభుత్వ చర్యలను తప్పుపడుతున్నారు. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో సిపిఐ జతకలుస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.దేశవ్యాప్తంగా వామపక్షాలు ఉనికిని కోల్పోయాయి. చివరకు కేరళలో సైతం ఆ పార్టీ చేతులెత్తేసింది. కానీ ఇప్పటికీ ప్రజా సంఘాల రూపాల్లో వామపక్షాలు బలంగా ఉన్నాయి. అయితే వామపక్షాల అవసరం అధికార పార్టీలకంటే ప్రతిపక్షాలకి ఎక్కువగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు చేయాలంటే వామపక్షాల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇంకా రెండున్నర సంవత్సరాలు మాత్రమే ఉండడంతో కచ్చితంగా ప్రజా పోరాటాలు చేయాల్సి ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే వామపక్షాలను కలుపు కెళ్తే మంచి ప్రయోజనం ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని తక్కువ సీట్లు విడిచిపెట్టిన అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.వచ్చే ఎన్నికల్లో ఆ మూడు పార్టీలు కూటమిగా ముందుకు వెళ్లడం ఖాయం. మరో 15 ఏళ్ల పాటు కలిసి ఉంటామని పవన్ కళ్యాణ్ తేల్చి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరి పోరాటం చేస్తే మాత్రం ఆ పార్టీకి ఇబ్బందికరమే. మొన్నటి ఎన్నికల వరకు ఒక ఎత్తు.. అంతకు ముందు పరిస్థితి వేరు.. మునుపటి మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా వ్యవహరించలేదు. ఆపై చాలా వర్గాలు దూరమయ్యాయి. తనకున్న సంప్రదాయ ఓటు

బ్యాంకుకు తోడు వామపక్షాల బలం లభిస్తే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉంటుంది. లేకుంటే కష్టం అన్న టాక్ ఉంది. ముఖ్యంగా సిపిఐ లాంటి పార్టీతో దూకుడుగా ముందుకు సాగితే కొన్ని జిల్లాల్లో ప్రభావం చూపవచ్చు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి సంబంధించి మంత్రి నారా లోకేష్ ను నిలదీసింది సిపిఐ నేతలు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో సైతం సీపీఐ నేతలు కనిపించారు. అందుకే సిపిఐ తో వైసీపీ పొత్తు ఉంటుందన్న అనుమానం వ్యక్తం అవుతోంది. మరి జగన్ మనసులో ఏముందో తెలియాలి.

## టేకాఫ్ కు అంతా రెడీ...

**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చేయబోతున్న ప్రతిష్టాత్మక 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. విమానాశ్రయ నిర్మాణ పనులను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. విమానాశ్రయానికి సంబంధించిన ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే మరియు ఎయిర్‌పోర్ట్ గ్రీనరీ పనులను ఆయన నిశితంగా వీక్షించారు.ఈ సందర్భంగా జీఎంఆర్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఉన్నతాధికారులు మంత్రికి ప్రాజెక్ట్ తుది మెరుగులకు సంబంధించిన పూర్తి వివరాలను మ్యాపుల ద్వారా వివరించారు. పనుల పరిశీలన అనంతరం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ అత్యంత కీలకమైన అప్‌డేట్‌ను ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన సివిల్ మరియు సాంకేతిక పనులు 100 శాతం పూర్తయ్యాయని, విమానాల రాకపోకలుప్రారంభించడానికి ఎయిర్‌పోర్ట్ పూర్తిగా సిద్ధంగా ఉందని జీఎంఆర్ సంస్థ స్పష్టం చేసిందని తెలిపారుఅన్నింటికీ మించి, అత్యంత కీలకమైన విమానాశ్రయ నిర్వహణ లైసెన్స్ కూడా మంజూరైందని మంత్రి అధికారికంగా ప్రకటించారు. "భోగాపురంలో ఇంత అత్యద్భుతమైన విమానాశ్రయ భవనం వస్తుందని అసలు ఊహించలేదు" అని మంత్రి రామ్మోహన్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ విమానాశ్రయ టెర్మినల్‌ను 'చేప ఆకారంలో' ఎంతో ఆకర్షణీయంగా నిర్మించామని ఆయన వెల్లడించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలు, కూటమి ప్రభుత్వ పక్కా ఎజెండా, మరియు అందరి సహకారంతో కేవలం రెండేళ్ల రికార్డు కాలంలోనే ఈ మెగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయగలిగామని స్పష్టం చేశారు. ఈ నిర్మాణానికి భూములిచ్చి పూర్తి సహకారం అందించిన స్థానిక రైతులు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ తేదీపై మంత్రి క్లారిటీ ఇచ్చారు. విమానాశ్రయం అన్ని రకాలుగా సిద్ధమైనందున, ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరనున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ తన పర్యటన తేదీని ఖరారు చేయగానే భోగాపురం ఎయిర్‌పోర్టును అధికారికంగా లాంఛనంగా ప్రారంభిస్తామని వెల్లడించారు. రానున్న రోజుల్లో పెరగబోయే ప్రయాణికుల రద్దీ, ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఎయిర్‌పోర్ట్ లోపల మరియు వెలుపల అన్ని రకాల అధునాతన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

## ఏపీలో జనాభా వృద్ధి కార్యక్రమం...

**పబ్లిక్ వ్యూ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండి, కాన్పుల మధ్య కనీసం రెండేళ్ల విరామం పాటించిన దంపతులకు నగదు పురస్కారాలు అందించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 11వ తేదీ నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముగ్గురు పిల్లలున్న దంపతులను ప్రతి జిల్లాకు మూడు, అలాగే కాన్పుల మధ్య సరైన దూరం పాటించిన జంటలను ప్రతి జిల్లాకు ఆరు చొప్పున గుర్తించి రూ.5 వేల నగదు బహుమతి అందిస్తారు. ఒకవేళ అర్హులైన దంపతులు ఎక్కువగా ఉంటే లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని, అలాగే ఉత్తమ సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందికి కూడా పురస్కారాలు ఇస్తామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో జనాభా పెరుగుదలపై చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఉందని చెప్పవచ్చు. గతంలో జనాభా నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబు, ప్రస్తుత మారుతున్న పరిస్థితుల్లో తన వ్యూహాన్ని మార్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో యువత సంఖ్య తగ్గి, వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోందని (డెమోగ్రాఫిక్ డివిడెండ్ నష్టం) ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అధికంగా వృద్ధుల జనాభాగా మారకుండా ఉండాలంటే దక్షిణ భారతదేశంలోని దంపతులు ఎక్కువ మంది పిల్లల్ని కనాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.జనాభా తగ్గుదల వల్ల కలిగే నష్టాలను నివారించడానికి చంద్రబాబు ఒక అడుగు ముందుకు వేసి చట్టపరమైన మార్పులకు కూడా శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల (పంచాయతీ, మునిసిపల్) ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించే నిబంధన ఉండేది. అయితే, జనాభా వృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ ఇద్దరు పిల్లల పరిమితి నిబంధనను ఏపీ ప్రభుత్వం తొలగించింది. ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు కూడా ఎన్నికల్లో పోటీ చేసేలా చట్టాన్ని సవరించడమే కాకుండా, ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం యోచిస్తోంది.

## సౌత్ కొరియాను చుట్టేసిన లోకేష్ భారీగా పెట్టుబడులు

**పబ్లిక్ వ్యూ డెస్క్:**
మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ కు భారీగా విదేశీ పెట్టుబడులను తీసుకురావాలన్న లక్ష్యంతో నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లారు. అనుకున్న లక్ష్యం మేరకు ఆయన భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇది నిజంగా శుభ పరిణామం. రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఆహ్వానం మేరకు ఆరు రోజుల పర్యటన నిమిత్తం లోకేష్ వెళ్లారు. ఆ దేశ రాజధాని సీయోల్ లో అడుగు పెట్టారు. గ్లోబల్ టెక్నాలజీ, ఆటోమొబైల్, సిటీ కండక్టర్ దిగ్గజాలతో వరుసగా భేటీ అవుతూ వస్తున్నారు లోకేష్. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అనుకూల వాతావరణాన్ని వారికి వివరిస్తున్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్ గా మార్చేందుకు ఆయన గట్టి ప్రయత్నం లోనే ఉన్నారుమంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా మంగళవారం అత్యంత కీలక భేటీ జరిగింది. ఆటోమోటివ్ టెక్నాలజీ దిగ్గజం హుండాయ్ మోబీస్ టాప్ ఎగ్జిక్యూటివ్ లతో లోకేష్ చర్చలు జరిపారు. ఏపీలో ఎలక్ట్రిక్ వెహికల్ ఎకో సిస్టం బలోపేతం చేసేలా.. అనంతపురం లేదా తిరుపతి పరిధిలో ఒక మెగా ఈవి సెమీ కండక్టర్ హబ్ తో పాటు బ్యాటరీ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని.. లోకేష్ హ్యుందాయ్ ప్రతినిధులను కోరారు. గతంలో ఏపీలో కియా మోటార్స్ సాధించిన అద్భుత విజయమే కొరియన్ సంస్థలకు ఒక బెంచ్ మార్గాన్ని గుర్తు చేశారు. అనంతపురం జిల్లాను దేశంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా తీర్చిదిద్దేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు.ఈసారి ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ రంగానికి ప్రాధాన్యమిస్తూ పెట్టుబడులను సాధించాలని లోకేష్ భావించారు. అందుకే ఈ పర్యటనలో ఎల్జి ఎలక్ట్రానిక్స్, సీయోల్ సెమీ కండక్టర్స్, ఘారాజు సంస్థల అధినేతలతో లోకేష్ ఈ విషయమై చర్చించారు. శ్రీ సిటీ కేంద్రంగా ఎల్జీ కంపెనీ 5000 కోట్ల భారీ ఇన్వెస్ట్మెంట్తో ఏర్పాటు చేయబోతున్న ప్లాంట్ పనులపై కూడా చర్చించారు. విశాఖలో అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేష్ ఎల్జి ప్రతినిధులను కోరారు. దాదాపు 468 కోట్ల రూపాయల వ్యయంతో ఏపీలో సెమీ కండక్టర్ అసెంబ్లీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ కేంద్రాన్ని నిర్మిస్తున్న అపాక్ట్ సంస్థతో మాట్లాడి.. రాబోయే రోజుల్లో ఏపీ యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా స్కిల్ డెవలప్మెంట్ అకాడమీతో ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రతిపాదించారు.మరోవైపు స్మార్ట్ హెల్త్ కేర్ ఫుట్వేర్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న షూ అల్స్ సంస్థ ప్రతినిధులతో లోకేష్ కీలక చర్చలు జరిపారు. ఏపీలో ప్రతిపాదిత 300 కోట్ల రూపాయల ఫుట్వేర్ ప్రాజెక్టు వేగవంతం చేయాలని కోరారు. దీంతో మూడు వేల మంది స్థానిక యువతకు ఉపాధి లభించనుంది. మొత్తానికి అయితే లోకేష్ దక్షిణ కొరియా పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. వేలకోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.



సాంప్రదాయక ఎత్నిక్ గ్లామర్‌కు నిలువుటద్దంలా నిలిచిన జాన్వీ కపూర్

# బాలీవుడ్ కంటే టాలీవుడ్‌కే సోనాలి బింద్రే ఫుల్ మార్క్స్



బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగినప్పటికీ, టాలీవుడ్ గురించి మాట్లాడాల్సి వస్తే తన అభిప్రాయం ఏమాత్రం దాచుకోనని నటి సోనాలి బింద్రే స్పష్టం చేశారు. రెండు పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో ఆమె చేసిన తాజా కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా టాలీవుడ్ పనితీరు, ప్లానింగ్, ప్రొడక్షన్ వాల్యూస్ పై ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు టాలీవుడ్ కు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చాయి. టాలీవుడ్ లో పని చేసే విధానం చాలా క్రమబద్ధంగా ఉంటుందని, సినిమా ప్రారంభానికి ముందే కథ, స్క్రీన్‌ప్లే, షూటింగ్ ప్లాన్ వంటి అంశాలు క్లియర్ గా రెడీగా ఉండటం వల్ల షూటింగ్‌లు అనుకున్న టైమ్‌కే పూర్తవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయడం వల్ల సెట్స్‌పై గందరగోళం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. అదే సమయంలో బాలీవుడ్ లో కొన్ని సందర్భాల్లో కథ లేదా సన్నివేశాల్లో చివరి నిమిషంలో మార్పులు చోటుచేసుకోవడం సాధారణమని, దీంతో షూటింగ్ షెడ్యూల్స్‌పై ప్రభావం పడుతుందని ఆమె వివరించారు. టాలీవుడ్‌లో మాత్రం ముందస్తు ప్రణాళికకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం నిర్మాతలు, డైరెక్టర్లు, నటీనటులందరికీ సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో కూడా తెలుగు సినిమాలు గత కొన్నేళ్లుగా భారీ స్థాయిలో అభివృద్ధి సాధించాయని సోనాలి అభిప్రాయపడ్డారు. కథకు తగ్గట్టుగా ఖర్చు పెట్టడంలో నిర్మాతలు వెనుకాడరని, టెక్నికల్ వాల్యూస్ కూడా అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయని ఆమె పేర్కొన్నారు. సెట్స్‌లో కళాకారులు, టెక్నీషియన్ల పట్ల చూపించే గౌరవం, ఆతిథ్యం కూడా టాలీవుడ్ ప్రత్యేకతల్లో ఒకటిగా ఆమె చెప్పారు. తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సోనాలి, తాను నటించిన సినిమాలే ఇప్పటికీ తనను తెలుగు అభిమానులకు దగ్గరగా ఉంచాయని అన్నారు. కెరీర్‌లో చేసిన క్యారెక్టర్ల ద్వారా లభించిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని ఆమె పేర్కొన్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్టింగ్ కు అవకాశం ఉన్న క్యారెక్టర్లు కూడా తెలుగు సినిమాల్లో దక్కడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని తెలిపారు. పర్సనల్ లైఫ్ లో క్యాన్సర్‌తో పోరాడి సక్సెస్‌ఫుల్‌గా కోలుకున్న తర్వాత, ఇప్పుడు ఎంపిక చేసిన పాత్రలతోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న సోనాలి బింద్రే, మంచి కథ, బలమైన పాత్ర దొరికితే మరోసారి తెలుగు సినిమాలో నటించేందుకు సిద్ధమేనని సంకేతాలిచ్చారు. ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, టాలీవుడ్ అభిమానులు ఆమె రీఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



అద్భుతమైన రోజ్-పింక్ లేస్ చీరలో రిద్ధి కుమార్ అపురూపమైన హుందాతనం

# టాస్ విన్ రేట్ 100%.. మ్యాచ్ రిజల్ట్ 0%.. తొలి గెలుపు కోసం శ్రేయస్ వెయిటింగ్!



**పబ్లిక్ వ్యూ డెస్క్:** భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇండియన్ క్రికెట్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కాని ఒక విచిత్రమైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 ఇంటర్నేషనల్స్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన 5 మ్యాచ్‌ల్లోనూ అతను టాస్ గెలిచాడు. దీంతో టాస్ గెలుపులో 100 శాతం సక్సెస్ రేట్‌తో దూసుకుపోతున్నాడు. కానీ, దీని వెనుకే ఒక చేదు నిజం కూడా ఉంది. టాస్ గెలిచిన అన్ని మ్యాచ్‌ల్లోనూ (100% టాస్ విన్ రేట్) ఓడిపోయి, జీరో (0%) మ్యాచ్ విన్ రేట్ కలిగిన ఏకైక టీమిండియా కెప్టెన్‌గా కూడా శ్రేయస్ నిలిచాడు. ఐర్లాండ్ చేతిలో చారిత్రాత్మక సిరీస్ ఓటమితో సహా, కెప్టెన్‌గా ఆడిన గత 5 మ్యాచ్‌ల్లోనూ ఇండియా ఓడింది.

(గురువారం) బ్రిస్టల్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరగనున్న 4వ టీ20 మ్యాచ్ శ్రేయస్ అయ్యర్‌కు అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో కూడా టాస్ గెలిస్తే, వరుసగా 6 మ్యాచుల్లో టాస్‌లు గెలిచిన మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీల ఆల్‌టైమ్ రికార్డును శ్రేయస్ సమం చేస్తాడు.

**ఎక్కువ టాస్‌లు గెలిచిన భారత టీ20 కెప్టెన్లు:**

6 – ఎంఎస్ ధోనీ (మే 2010 – ఫిబ్రవరి 2012)

6 – విరాట్ కోహ్లీ (ఆగస్ట్ 2019 – డిసెంబర్ 2019)

5 – రోహిత్ శర్మ (ఫిబ్రవరి 2020 – ఫిబ్రవరి 2022)

5 – ఎంఎస్ ధోనీ (సెప్టెంబర్ 2007)

5 – శ్రేయస్ అయ్యర్ (జూన్ 2026 – జూలై 2026)

**సిరీస్ ఓటమిని తప్పించుకోవాలనే కసిలో భారత్:**

ఐర్లాండ్ చేతిలో చరిత్రలోనే మొదటిసారి సిరీస్ ఓడిపోయిన భారత్..

ఇప్పుడు ఇంగ్లాండ్ చేతిలో కూడా మరో సిరీస్ పరాభవాన్ని మూటగట్టుకోకుండా ఉండాలంటే ఈ 4వ టీ20లో తప్పకుండా గెలవాల్సి ఉంది. ఈ మ్యాచ్ ద్వారా శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా తన మొదటి విజయాన్ని ఖాతాలో వేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు.

**ఇరు జట్ల స్క్వాడ్స్:**

**భారత జట్టు:** అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజు శాంసన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్

**ఇంగ్లాండ్ జట్టు:** ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్

# రంగారెడ్డి ఔట్.. క్వాలిఫయర్-2 టికెట్ కన్ఫర్మ్ చేసుకున్న కరీంనగర్ డైమండ్స్



**పబ్లిక్ వ్యూ డెస్క్:** తెలంగాణ ప్రీమియర్ (టిజీ20) లీగ్-2026లో భాగంగా ఉప్పల్ వేదికగా రంగారెడ్డి రైజర్స్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కరీంనగర్ డైమండ్స్ జట్టు 75 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కరీంనగర్ జట్టు క్వాలిఫైయర్-2కి అర్హత సాధించింది. ఇక టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 5 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. కరీంనగర్ కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ భారీ సెంచరీతో జట్టును ముందుకు నడిపించాడు. అతడు కేవలం 61 బంతుల్లోనే 11 ఫోర్లు, 10 సిక్సర్లతో 137 రన్స్ చేశాడు. ఈ టీజీ20 లీగ్‌లో తన్మయ్‌కి ఇది మూడో సెంచరీ కావడం విశేషం.

**రాణించిన సింహా.. రంగారెడ్డి బౌలింగ్ విఫలం:**

తన్మయ్‌తో పాటు వైస్ కెప్టెన్ సింహా హాఫ్ సెంచరీ (50 పరుగులు)తో రాణించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 69 బంతుల్లోనే 139 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాగా రంగారెడ్డి బౌలర్లలో అర్బజ్ కరీముద్దీన్ రెండు వికెట్లు పడగొట్టగా.. అరుణ్ కుమార్, కెప్టెన్ వినయ్ త్యాగరాజన్, సుకేత్, నితిన్ సాయి యాదవ్ తలో ఒక వికెట్ తీసుకున్నారు.

**చేతులెత్తేసిన రంగారెడ్డి బ్యాటర్లు:**

239 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ జట్టు కేవలం 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అయితే కరీంనగర్ స్పిన్నర్ అమిత్ శర్మ తన అద్భుత బౌలింగ్‌తో రంగారెడ్డి బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బకొట్టాడు. అతను 3.3 ఓవర్లలో కేవలం 16 రన్స్ మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీసుకుని కరీంనగర్‌కు విజయాన్ని అందించాడు. అమిత్‌తో పాటు రూపేష్ వర్మ కూడా 2 వికెట్లు సొంతం చేసుకున్నాడు.

అయితే రంగారెడ్డి రైజర్స్ జట్టు బ్యాటర్లలో కెప్టెన్ వినయ్ త్యాగరాజన్ (33 బంతుల్లో 63), నితిన్ సాయి యాదవ్ (50) హాఫ్ సెంచరీలతో ఒంటరి పోరాటం చేసినప్పటికీ జట్టును మాత్రం గెలిపించలేకపోయారు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో రంగారెడ్డికి ఈ ఘోర ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో రంగారెడ్డి ఇంటికి వెళ్లిపోయింది.

# 2027 వరల్డ్ కప్ కోసం పాక్ ప్రిపరేషన్ షురూ.. కొత్త టోర్నీతో బిగ్ ప్లాన్!




**పబ్లిక్ వ్యూ డెస్క్:** వరుస పరాజయాలతో సతమతమవుతున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగబోయే 2027 వన్డే ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే మైండ్ గేమ్ షురూ చేసింది. ఎలాగైనా ఒక పటిష్టమైన పాక్ జట్టును రెడీ చేసేందుకు, వచ్చే ఏడాది ఆగస్టులో సరికొత్త డొమెస్టిక్ టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టబోతోంది. దేశవాళీ ఫస్ట్ క్లాస్ సీజన్ కంటే ముందే ఈ 50 ఓవర్ల టోర్నీ జరగనుందని ఈ టోర్నీలో నాలుగు జట్లు తలపడనున్నాయి. వరల్డ్ కప్‌కు ఇంకా కేవలం 18 నెలల సమయం మాత్రమే ఉంది, కాబట్టి ప్రిపరేషన్స్ మొదలు పెట్టడానికి ఇదే రైట్ టైమ్ అని ఆకిబ్ జావేద్ తెలిపారు. పాక్ వైట్-బాల్ ప్లేయర్లు అందరూ ఇందులో ఆడటం కంపల్సరీ. సెలెక్టర్లు, కోచ్‌లు కలిసి ప్రతి ప్లేయర్‌కు ఒక నిర్దిష్టమైన రోల్ ఇచ్చి మరీ మైదానంలోకి దించనున్నారని పేర్కొన్నాడు.

**టాప్-4లో లేకపోతే ఒప్పుకునే ప్రసక్తి లేదు:**

పాకిస్తాన్‌లోని ప్రైమ్ అండ్ రైజింగ్ స్టార్స్ ఆడే ఈ టోర్నీని ఫ్యాన్స్ కోసం లైవ్ బ్రాడ్‌కాస్ట్ చేయనున్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా వరల్డ్ కప్‌కు కిరాక్ ప్లేయర్లు దొరుకుతారని పీసీబీ మేనేజ్‌మెంట్ నమ్ముతోంది. ప్రపంచ వన్డే ర్యాంకింగ్స్‌లో పాక్ టీమ్ ఖచ్చితంగా టాప్-4 లో ఉండాలని, అంతకంటే తక్కువ వస్తే అస్సలు ఒప్పుకునేది లేదని ఆకిబ్ జావేద్ టార్గెట్ సెట్ చేశారు.

**ఈసారి సెమీస్ బెర్తు టార్గెట్:**

పాకిస్తాన్ జట్టు గత 3 వన్డే ప్రపంచకప్‌లలో కనీసం సెమీఫైనల్‌కు కూడా క్వాలిఫై అవ్వలేదు.. పైగా ఇటీవలి టీ20 వరల్డ్ కప్‌లలో కూడా ఘోరంగా విఫలమవడంతో పాటు ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) పాయింట్ల పట్టికలోనూ చివరి స్థానంలో నిలిచింది. పరువు కాపాడుకోవడానికైనా ఒక స్థిరమైన వన్డే జట్టును తయారు చేసుకోవాలని దాయాది దేశం ఆశిస్తోంది. అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 మధ్య జరిగే వరల్డ్ కప్‌కు ముందే ఈ టోర్నీ ముగియనుంది.

On behalf of Published and owned by CHIRIKI LOKESWARA RAO , Published at D.NO: 12-132, B.C. COLONY, VILLAGE PARAWADA, POST & MANDAL, ANAKAPALLI DIST, ANDHRA, ANDHRAPRADESH -531021. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, FLAT.NO: 504, BHARAT TOWERS, 5TH LANE, DWARAKA NAGAR, DISTRICT VISAKHAPATNAM, ANDHRAPRADESH-530018. Editor: CHIRIKI LOKESWARA RAO, (Responsible for selection of news under the PRB Act ) PRGI No: APTEL/2023/88653